
# ఒట్కాణేకా బిస్తళ్లా



## అవసరాల రామకృష్ణారావు

మా ఇద్దరికీ మంచి సీట్లే దొరికాయి, ఆ రైల్వేకంపార్ట్ మెంటులో ఎదురెదురుగా, సైడ్ప్కి ఉన్న సింగల్ సీట్సు. మరొకమారు రంగి వైపు చూస్తే నాకే ఆశ్చర్యం వేసింది. నిన్న నేను చూసినప్పుడు ఎలా ఉండేది! ఇంతలో ఎంత మార్పు! ఆ ఆలోచనలో చిన్న గర్వం లాంటిది కూడ కలిగింది నాకు.

ఎంతసేపూ ఎడంచేతి వేలు నోట్లో. కుడి చెయ్యి బరుక్కుంటూ చింపిరి జుట్టుమీద. మాసిపోయిన, మాసికలు వేసిన బట్టలు. మట్టికొట్టుకు పోయిన బతుకులు! దీన్నింతగా మార్చి తిరుగు ప్రయాణంలో దీన్ని తీసుకువస్తా ననుకున్నా నా! జరిగిందంతా ఓ కలలా వుంది.

రాయగడలో సాహితీ సభలు జరిగేయి. అక్కడ అనుకోకుండా నేనూ రవీ కలిశాం. ఎన్నో ఏళ్ళ తర్వాత. అక్కణ్ణించి వాళ్ళ ఊరు చీపురుపల్లి వెళ్ళాం. మ ఇద్దరి వయస్సుల్లో ఓ ఏడేళ్ళు తేడా లేక పోలేదు. కలుసుకోక పోవాలి గాని యిహ ఓ నిమిషం విరహం ఓర్వం. రాత్రి, పగలూ తిండీ నిద్రా, ఫుల్‌స్టాపూ, కామా లేకుండ యిహ కబుర్లే కబుర్లు. ఆ సందర్భంలో నే నా కొత్త బాధ ఒకటి ఒలికించాను.

"మళ్ళీ స్వయానా మా పెత్తల్లి కూతురు. ఈ సారి మా అక్కయ్య గుమ్మం తొక్కడానికొచ్చాడా నా మొహం చెల్లడం లేదు. నిలబెట్టుకోలేనప్పుడు వాగ్దానాలు చెయ్య కూడదు, ఏ మంటావ్?"

"అదేమిటయ్యా, వాళ్ళు మంచి వ్యాపారస్తులన్నావ్. నీ చేత ప్రామిస్ చేయించుకునే కర్మ వాళ్ళ కేం?" అని రవి అడిగాడు.

"ఏం చేసాం .... ఎంత అప్పుకి అంత దౌను అన్నారు. సిరి సంపదలుండే సరా? ఇక్కడ వస్తువు అక్కడ తీసిపెట్టే సౌకర్యం ఇంట్లో వుండాలి గద! ఆ ఇంట్లో ఎవరెప్పుడుగు పెట్టినా, పని మనిషి లేదని ఒకటే రొద. అందులో ఈ మధ్యనే వెళ్ళినపుడు మా అక్కయ్య. మరీ నా ప్రాణం తోడేసిందనుకో."

"ఏ మంటుందేం?"

"అదే ముందీ, ఎక్కడైనా మంచి పనిమనిషిని చూడమనీ. ఎంతైనా యిస్తుందట. అంత మందికి వండి, వడ్డించ లేక ఆవిడ గారి ప్రాణం సొమ్మసిల్లి పోతోందట. ఇక అంటు గిన్నెలు కూడా ఎక్కడ తోమనని కళ్ళ నీళ్ళ పర్యంతమైంది. రాత్రి పగలూ పడి వుండే మనిషి కావాలిట. అన్నం, బట్టా, కోరిన జీతం, నేనెంత చెబితే అంతా యిస్తుందిట. పొరపాటున అన్నాను, నే నెవరినో ఒక త్తిని పై ఊర్నించి అయినా తెచ్చిన కుదురుస్తానని ....

అంతే. ఆమాట పట్టుకు కూచుంది. మా ఊరు చేరుకున్నా నోలేదో.... ఇకచూసుకో.... అవే ఉత్తరాలు, అవే టెలిగ్రాములు ఏదో అన్నాను గాని అంత కంగారైతే నేనెక్కడ చావనూ, ఇదేం బజార్లో దొరికే వస్తువా?

"పోనీ మా దాసీమనిషి లచ్చప్ప రెండో కూతురు నీతో వస్తుందేమో కనుక్కోనా?" అన్నాడు రవి,

ఆ మాటతో పోయిన కరెంటు వచ్చి నట్టయింది నా ప్రాణానికి. లచ్చప్ప కథ వివరించాడు రవి.

దానిమొగుడూ ఒకప్పుడూ పెద్దమనిషే నట. అయితే వాడు, తెచ్చింది తక్కువా సంసారాన్ని పెంచింది ఎక్కువా.

"ప్రతిరెండేళ్ళకీ ముగ్గురేసి పిల్లలు" అనేది ధ్యేయంట. అలాంటి మొగుడితో చివరంటూ వూగలేక, వాడికర్మకి వాణ్ణొది లేసి, యీఊరు కొట్టుకొచ్చిందట, లచ్చప్ప ఇంట్లో నలుగురూ నాలుగు పన్లూ చేసుకుని ఎలాగో పోషించుకుంటున్నారట.

ఓ గంట సేపు అన్నీ బోధపరిచాక రంగిని నాతో పంపడానికి అది ఒప్పుకుంది. దానికో నూరు రూపాయలు యిచ్చాను. అది గాక పిల్ల జీతంగా నెలనెలా పాతిక రూపాయలు తల్లికి పంపించాలనీ, రవి మధ్యవర్తిగా ఉండాలని ఒప్పందం.


అయితే దాన్ని రైలెక్కించే లోగా మేం పడ్డ పాట్లు ఇన్నీ అన్నీ కావు. ఏమిటంటారా? అతని యింట్లో ఆ సాయంకాలం ఆ పదేళ్ళ గుంట ముంతకి అభ్యంగన స్నానం.

స్నానాంతరం, నూతన వస్త్రయుగ్మ సమర్పయామి.

అప్పటి కప్పుడు రెడీమేడ్ బట్టలకొట్టు నుంచిమంచి జాకట్టూ పరికిణీ తెప్పించి... కట్ట బెట్టించాం.

ఆ రాత్రికి రవి భార్య సీత దగ్గరే దాని పడక. అంతేనా?

మర్నాడు పొద్దున లచ్చప్ప చేత దాని జుట్టు విప్పించి, పేలు నొక్కించి తవ్వెడు వాసన నూనె యింకింపించి....ఇలా ఎన్నని చెప్పను! సూపర్‌విజన్ అంతా సీతదే ఏం చెయ్యాను మరీ, ఏమాత్రం దర్జీగా కవి పించినా అక్కయ్య గుమ్మం ఎక్కనివ్వదు. అంత శుభ్రం పిచ్చిదానికి!



పిల్లకి జరిగిన మేకప్ చూసి లచ్చువ్వ యిరుగుపొరుగు వారంతా ముక్కున వేలేసుకున్నారు.

"ఏఁటేటీ, యిది రంగమ్మ తల్లే! సుంద మావఁ ఎదగడానికి పదేను దినాలు పట్టుద్ది గాని, నీగుంట జిగేల్మని పోడానికి ఒక్క పొద్దే ఎలా సరిపోయిందే లచ్చువ్వా? దీని తలతిక్క కుదిరి కుదురుగా ఆరు నెల్లున్న పెకారం యిని సావాలిగాని ఆయమ్మ యిక దీన్నొగ్గుతాదేటి? ఏటంటావ్? కూకేటి, గుడ్డేటి, యిక ఓ ఆయ్య సేతిలో ఎట్టినా ఆరి సేతి సలవే. ఉన్నట్టుండి నీ అదృష్టం ఏం తిరగబడిపోనాదే ఓలమ్మో!"

రైల్లో దాన్నలా ఎదురుగా చూస్తుంటే ఎంతో తృప్తి కలిగింది నాకు. అయితే రంగి ఓ పట్టాన కొరుకుడు పడే రకంలా లేదు. అంతెందుకూ, పొద్దుట వాళ్ళమ్మే అనలేదూ మొదట్నుంచీ దీని దంతా ఓ చిత్రమైన స్వభావమనీ .... గంటకో ముక్క గాని నోట్లోంచి ఊడి పడదనీ .... దాని మనసులో ఏముందో తనకే తెలీదనీ. మేం కలిసి ప్రయాణం చేసి రెండు గంటలు దాటే వుంటుంది. అలా బుగ్గని ముడిచిన చెయ్యి పెట్టుకుని కూచున్న మనిషి కూచున్నట్టే వుంది. పోనీ ఆ చూపుల్లో ఏ ముందో అంటే అదీ చెప్పలేము.

అవి దుఃఖమూ కాదూ, సంతోషమూ కాదూ. అంత చిన్న పిల్లలో ఆ నిర్లిప్తత ఎక్కడా చూడబోము.

'ఇదిగో. ఓ బటాణీ లబ్బీ, ఇలా రా' పిలిచింది. హఠాత్తుగా. అమ్మయ్య! ఇప్పటికి రంగి గొంతుక విడింది. గొంతుకక్కటే కాదు బుగ్గని ఆనించుకున్న ఆ చతి పిడికిలి విడుతోంది. ఆ రోజు వుదయం తల్లిని విడిచి వచ్చే ముందు రంగి ఏం అడిగిందో నాకు గుర్తొచ్చింది.

"ఒలే అమ్మా. నాను ఎల్లొత్తానే .... దార్లో కొనుక్కుందికి నీ పేత్తో నువ్వు ఏటయినా యియ్యే!"

లచ్చువ్వ వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ అంది.

"కట్టుకున్న బొట్టిని పరాయి సేతుల్లో పెట్టేస్తున్న కసాయిదాన్ని! నా కాడ ఏటుంటుంది బుల్లీ!"

కూతురి ఒళ్లంతా ఓ మారు ప్రేమతో తడిమింది. దగ్గరకి తీసుకుని గట్టిగా ముద్దెట్టుకుంది. చిన్న పిల్లని జాగ్రత్తగా చూసుకోండని అంపకాలు పెట్టింది. ఎక్కడున్నా రక్షించండని వెయ్యి దేవుళ్ళకి మొక్కింది. రొంటి నున్న దేదో విప్పి రెండో కంటికి కనబడకుండా అరి చేతులో నొక్కింది.

అమ్మ యిచ్చిందెవరైనా పట్టుకుపోతారేమో అన్నట్టు అప్పట్నుంచీ రంగి ఆ గుప్పిలి అలా మూసే గట్టిగా లోపలున్న దాన్ని పట్టుకునే వుంది. కనీసం ఏ రూపాయి బిళ్ళయినా అయి వుండదా అనుకున్నాను నేనిచ్చిన వంద రూపాయల

పోటు. అక్కణ్నుంచి అలాగే బియ్యం బాకీ కింద వెళ్ళిపోయిందని విన్నాను గాని. ఆ మాత్రమైనా లేకపోతుందా అనుకున్నాను.

ఇప్పుడు చూద్దునూ, తెల్లబోయాను!

అవి పది పైసల బిళ్ళ! ఇంత ఘోరమా వీళ్ళ బతుకులు!

ఆ కొనుక్కొన్న కొన్న బిటాణీలు ఒకటీ. ఒకటీ పటుకూ, పటుకా కొరుకుతోంది ప్రతిగింజా చేతో పట్టుకుని గుండ్రంగా తిప్పుతూ కొసరికొరి నవులుతోంది రంగి.

ఇంతలో ఓ ముష్టి వాడు అక్కడికొచ్చేడు నేరక పోయి. రెండు బిటాణీ గింజలు పారెయ్యమని దానిముందు చెయ్యి జాచాడు. దానో రంగి వేసిన కేక ఎవరూ ఊహించనిది. ఆ కేసురుకి ముష్టివాడు మరుడు మొగలెయ్యడం కాదు. ఏకంగా ఆ గులకి రైలే దద్దరిల్లి వట్టు అయిపోయింది!

పొద్దుటనగా చద్దెన్నం తిని రైలెక్కిన పిల్ల పాపం ఎంత ఆకలిగా ఉండి అంత కేక వేసిందో!.... బిస్కట్లవాడు అమ్మకాని కొస్తే మంచి క్రీమ్ బిస్కట్ పేకట్ ఒకటి కొన్నాను అయిదురూపాయలిచ్చి. అది దాని చేతిలో పెట్టి "తింటూ వుండవే రంగి అన్నీ నీకే! రైలు ఆగనున్నట్టుంది. నే వెళ్ళి మంచి నీళ్ళు తెస్తాను. అని కిందకి దిగాను. సీసానిండా నీళ్ళు పట్టుకుని. తిరిగి నేను రైలెక్కేసరికి, నా ముందు దృశ్యం ఇదీ.

ఏదో బలవంతాన నోట్లో పెట్టుకున్నట్టు ఓ బిస్కట్ తీసుకుంది రంగి. మిగిలిన పొట్లం విసురుగా సీటు మీద పడేసింది. అక్కణ్ణుంచి అది కింద పడినట్టుంది. మరి ఎక్కణ్ణుంచి వచ్చిందో సమయానికి ఓ కుక్క అందుకుంది. అందరూ ఛీ ఛీ అంటూనే ఉన్నారు. అది దాన్ని నోట కరుచుకొని మాయం అవనే అయింది.

అన్నిటికన్నా ఆశ్చర్యం తన కళ్ళెదుట తన కాళ్ళ దగ్గర యింత జరిగినా రంగి పట్టించుకున్నట్టేలేదు! రెండు బిటాణీ గింజలు అడిగితేనే బిచ్చగాణ్ణి తరిమి కొట్టిన రంగి అంత ఖరీదయిన బిస్కట్ల పొట్లం కుక్క తన్నుకు పోతూంటే కనీసం అందరితో పాటు తనూ "ఛీ" అనదేం? బిటాణీల ముందు బిస్కట్లా? తీసికట్టా నాకేదో తెలిసినట్టయింది. గుండె చేతో పట్టుకుని కూలబడ్డాను సీట్లో దాని వైపే చూస్తూ.

"నేను ఎందుకు ఛీ అనలేదో తెలుసా? ఆ అక్షరం నీలాంటి వాళ్ళకోసం దాచి ఉంచాను గనుక" అన్నట్టు తోచింది అది. అంతేకాదు సుతిమెత్తని నా మనసు మీద మాటాడకుండా రంగిచాలా సుత్తిదెబ్బలే వేసింది.

"చెమటోడ్చి నన్ను పెంచింది మా అమ్మ కన్నీళ్ళతో సాగనంపుతూ కడుపు తడిమి నాచేతిలో పెట్టింది. ఎంత తక్కువైతేనేం, దానో కొనుక్కున్న బిటాణీల విలువ నీకెలా తెలుస్తుంది? సంతలో కొనుక్కున్న గొడ్డుని తోలుకు పోతున్నట్టు నన్ను తీసుకెడుతున్నావు. నువ్వు ఎంత డబ్బు పెట్టి కొంటేనేం. అవి కుక్కలకే తగును. వెలకాదు, విలువ ముఖ్యం. ఆమాత్రం నీకు తెలీదా?"


అంత చిన్న పిల్ల అంత గట్టి ప్రశ్న వేసిందా అంటే నేను చెప్పలేను. రంగి అలా ప్రవర్తించడానికి కారణం అదే అని కూడా రుజువు చెయ్యలేను. కాని దాని చూపులూ, చేష్టలూ మొదట్నుంచీ నన్ను తికమక పెడుతూనే వున్నాయి. వాటికి అర్థం నా కలాగే తోచింది అంతే.

ఆ తర్వాత మా ఊహా సంభాషణ యిలా సాగింది :

'అదేమిటి, నేను నీకు హాని తలపెట్టి తీసుకెడుతున్నానా? ఒక్క రోజులో నిన్నెంత చక్కగా తయారుచేశానో చూడు,'



మీకే ఎక్స్‌రే కళ్లుంటాయో ?!..




'గుళ్లోకి మేకని పంపుతారు చూడ . బలి కోసం దాన్ని అలంకరిస్తారు మరి. స్నానం చేయించి, పసుపు - కుంకుమా పెడతారు. గంటలూ, పువ్వులూ కడతారు. ఆ సొగసు చూసి మురిసిపోవడానికి, మేమేం పశువులం కాదు, ఆలోచించ గల మనుషులం అయినా వున్నట్టుంది మా కుటుంబం మీద యింత దయ పుట్టుకొచ్చిందేం మీకు అదేం మాకు ఉపకారం కాదు. మీకు అవసరం. యావజ్జీవం చాకిరికి ఓ బానిసని చవగ్గా కొనుక్కుపోతున్నావు. ఎవరికి తెలీదని? ఇందులో దళారీవి, నీ కమిషన్ మిటో నువ్వే గుర్తు చేసుకో. మీ అక్కయ్యకి నువ్వు పది వేలు బాకీ లేవూ? వడ్డీ కుండా అప్పిచ్చింది. ఆవిడ నోరెత్త కుండా ఆవిడకి సాయం చెయ్యడం నువ్వు చేసుకున్న ఏర్పాటు అవునో కాదో నీమనసునే అడుగు.

ఒళ్లు వెల్ల ఒణికిపోయాను. ఆ ఆలాపులు తప్పించుకుందామని అటూ యిటూ దృష్టి మరలించాను. ఏ అలంకరించుకున్న ఆడదాన్ని చూసినా మొగ జనమంతటినీ యిక్కడ పెంపుడి విలదీస్తున్నట్టే తోచింది.

చిరు చీకటి వేళకి సొగసు పూర్తి చేసుకుంటుంది ఆమె. ఆ వారో ఈ వారో నిలబడుతుంది ఆ కాంత. అందుకే వారకాంత అన్నారేమో! దేని కోసం? ఎంతో సుఖమూ, శాంతీ దొరుకుతాయనా ఆ అలంకారం?

మరో చోట మరో దృశ్యం.

అప్పుడే వాడు ముళ్ళ తతంగం పూర్త యింది. నుదుట కల్యాణ తిలకంతో, బుగ్గని చుక్కతో, కొత్త నగలతో, మంచి బట్టలతో భర్త వెనకే అడుగులు వేస్తోంది ఆ అమ్మాయి. డబ్బు మనమే యిచ్చుకుని ఎదుటి మనిషికి అమ్ముడు పోవడమనే అతి నికృష్టమైన వ్యవస్థ ఆడపిల్ల కట్నం ఇవ్వడం.

ఎవరూ చూడకుండా వేస్తే కన్నం

వణుగుర్లో పుచ్చుకుంటె కట్నం

కట్నం పుచ్చుకునే సిగ్గుమాలిన పని, మనసున్న ఏ మగాడి కయినా జీవితాంతం ఉండిపోయే మచ్చ. భర్త వెనకే నడుస్తున్న ఆ అమ్మాయి కంట్లో కన్నీళ్లు. సాధారణంగా ఏడుస్తూ అడుగులేస్తుంది గనుకే ఏడడుగులు అన్నారేమో!

సమస్త స్త్రీ జాతి నన్ను విలదీసినట్లయింది.

అందులో పురుషుల స్వార్థమే ప్రధానమైతే, వ్యాపారమే ముఖ్యపాత్ర వహిస్తే బానిసత్వం, వివాహం, వ్యభిచారం—ఈ మాటలన్నిటికి ఇంచు మించు అర్థం ఒకటే,

సిగ్గుతో కుళ్లడిల్లి పోయాను.

నోటితో ఒక్క ముక్క చెప్పకుండా ఇంత చిన్న పిల్ల నామీద ఎంత దెబ్బ తీసింది!

అన్నీ తెలిసి కూడా యింకా ఈ పాపపు పని కొనసాగించనా? ఊహుం నేనో నిశ్చయానికి వచ్చేశాను.

"మీ అమ్మ దగ్గిరకి దిగబెడతాను? వస్తావుటే? చీకటి గదిలో చిన్న దీపం పెట్టినట్టయింది దాని మొహం ఆ చిరునవ్వు అందం ముందు. నేనా పిల్లకి చేయించిన శృంగారాలన్నీ వెల వెల బోయాయి. అందరూ కొనుక్కునే బహాణీ ముందు కొందరికే అందుబాటులో ఉన్న క్రీం బిస్కట్లు ఎప్పటికైనా దిగదుడుపే కదా! ఆ జంక్షన్లో ఆగి, తిరుగు రైల్లో దాన్ని యిల్లు చేరేశాను. అదీ కనుమరుగు అయ్యాక రవితో అబద్ధం ఆడేను, రైలెక్కిన మెదలు రంగి నాన పేచీ పెట్టిందని. నిజాని రవితో ఏం చెప్పేనో, మా అక్కయ్యతో ఏం చెప్పుకున్నానో అది కాదు ముఖ్యం. ఏ మనిషి అయినా తను చేసిన పనికి తాను సంజాయిషీ చెప్పుకోగలితే చాలు. చేసిన తప్పు దిద్దుకునే మానవత్వం వుంటే చాలు. వదిమందిని చావగొట్టే రౌడీ తనం కాదు. ఏ ఒక్క ఆడపిల్ల కన్నీటిని తుడవగలిగినా అంతే చాలు. మగతనం అంటే అదే.

# వారసత్వం

నాన్నా !
చిన్ననాడు
నీ కళ్ళలో
నా భవిష్యత్తును చూశాను.
నువ్వు దేనికోసమో వెతుకుతున్నట్టు
నిరంతరం దేనితోనో సమరం
చేస్తున్నట్టు
నీ కన్నీళ్ల బుల్లెట్లుగా
మినీభవిస్తున్నట్లు,—
అనాడులనుంచీ
అనాధ పాటేదో
నీ పెదవుల్ని కాలుస్తున్నట్టు ...
ఇప్పుడు నాకేం మిగిలిందని?
ఇంక ఆలోచనలొద్దు
నీకోపం నాకియ్యి
నీ పాట నాకియ్యి
నీ దివిటీ నాకియ్యి
ప్రపంచాన్ని మార్చేస్తాను

—ఎన్. గోపి